


# బ్రిడ్జి

బలివాడ కాంతారావు

మార్చి పదిహేనో తారీఖు. గ్రాండ్ట్రంక్ యెక్స్ప్రెస్ సరిగ్గా సాయంత్రం అయిదుగంటలకు న్యూఢిల్లీ స్టేషనునించి కదలి పోయింది. ఫస్టుక్లాసు పెట్టెలో గాజు కిటికీ మీద తలవంచి చూస్తున్నాడు సుందరయ్య. దేశం చూడ్డానికి వచ్చి తిరిగిపోతున్నాడు. రైలు కదిలేముందు స్టేషనులో ఏపిలుపళ్ళు కొనటం మరచాడు. అందువల్ల యెదరగా కూర్చున్నావిడ వెట్టిగా వాగిందని తన అలుక.

అలుక తీరని మనసు మొర్రో మొర్రో మంటోంది. దయ చూడుమని దేముని ప్రార్థించే బాపతు కాదు. ఏనుగులా కని పించినా. పీనుగులా తూలిపోతున్నాడు. ఆపిలుపండు యివ్వలేదని కుర్రాడు కాళ్ళు తన్నుకుంటూ యేడుస్తున్నాడు. వాడి చెమ్డా లూడదియ్యాలన్నంత కోపం వచ్చేస్తోం దతనికి. ఒక్కడని ముద్దించే మొద్దబ్బాయిని చేసింది. మొదట్లో మూగవాడౌతాడేమో నను కుంటే మాట వచ్చినదగ్గరనించీ గాడిదలా అన్నిటికీ ఒకటే యేడుపు.


ఈ గాడిద ఆ తల్లికి జాతిగుర్రం. ఏ జాతి గుర్రమో ఆ తల్లి చెప్పదు. సుంద రయ్యకూ తెలీదు. ఒకోసారి కప్పలా బెకబెక లాడుతాడు. ఇంకోసారి యీగలా వాల్తాడు. మరోసారి దోమలా చెవిమీద దాడిచేస్తాడు.

రైలు అప్పటికే ఫరీదాబాదు యంత్రాల స్నేహితులతో మంతనా లాడుకుంటూ నడు స్తోంది. వా దేడుస్తున్నా. రైలు అరుస్తున్నా. ఆవిడేమంటున్నా — యీ గోలకి మందుగా మౌనం మ్రింగి కిటికీనించి చూస్తున్నాడు సుందరయ్య. అడుగుచక్రాల అట్టహాసం నిర్లక్ష్యంచేస్తూ వాలిన పొద్దు రైలు కిందినించి చొచ్చుకుంటూ రెండోవేపు వస్తోంది. వింత వింత నీడలను పరుగెత్తిస్తున్న యీ వెలుగు యెన్నెన్నో నీడల్ని గుర్తుకు తెస్తోంది. సంఘటనలతో పొడుగైన జీవితం కాస్సేపు సంకుచితమైంది. ఇప్పుడే చికిత్స చెయ్యించు కోడానికి జీవితాన్ని పరీక్షకు పంపుతున్న ట్లనిపించింది సుందరయ్యకు. గడపిన జీవితం యీ నాటికి మానసికంగా తనని రోగిష్టిని చేసేసింది. విదానం చేసినా యీ వయసులో మందులు పనిచెయ్య వనుకున్నాడు.

ఎదురగా కూర్చున్న సుందరాంగి వయసు పాతికేళ్ళని అంటుంది. బహూశః వుంటే యైదేళ్ళు అటే వుండవచ్చు. ఆమెకు పెళ్ళి కాలేదన్నా నమ్మేవాళ్ళుంటారు. ఆమె సుంద రయ్య కూతురంటే కాదన్నవాళ్ళుండరు. కానీ ఆమె సుందరయ్య భార్య. రిజిష్టర్డు మేరేజ్ చేసుకున్నాడు.

ఇంకా యీ కుర్రాడి యేడుపు తగ్గలేదు. ఇప్పుడు ఆపిల్పండెలా వస్తుంది? ఆమె కోపంగా బుగ్గల్ని నొక్కింది. చిరాకు ఆమె కళ్ళని పిల్లికళ్ళని చేసాయి. ఎదరగా ఎల కలా వున్నట్లున్నాడు సుందరయ్య. ఆ జార్జెట్ చీర, ఆ లిప్స్టిక్, ఆ క్రీమ్కోటా....ఏదీ చిందరవందర కాలేదు. చెరగలేదు. చెరిగినట్లు తన కంటికి కనపడలేదు.

తల తిప్పేసాడు. గోధుమ పొలాలు అంతా పచ్చపచ్చగా వున్నయ్. ఎక్కడో ఒకేచోట పండుతున్న పంట. ట్రాక్టరు ఒక మూల పడివుం దొకచోట. అది పనిచెయ్యని




ట్రాక్టరు అనుకున్నాడు. ఈ ట్రాక్టరు రిపేరు చేసినా పనిచెయ్యదు. పండే భూమికి పనికి రాదు. తను సరిగ్గా యీ ట్రాక్టరే అనుకున్నాడు. పని చెయ్యలేని ట్రాక్టరని తెలుసుకుని మరీ యీవిడ తనని యెందుకు పెళ్లి చేసుకుందో? ఈమె ఒక ఋతువులో పండవలసిన పంట. తను గడచిన ఋతువులో పచ్చగా వుండేవాడు. ఆ పచ్చదనం నిత్యం వుంటుందనుకున్నారు ఆనాడు. అది డబ్బు పచ్చదనంలాంటిదే అనుకుని పొరపడ్డాడు. అందుకే కుర్రాడిగా పెద్దపనులు చేసాడు. పెద్దలు గడించి వదిలిన ఆస్థిపాస్తులతో, వచ్చిన అవకాశాలన్నీ తనపరం చేసుకున్నాడు. ఇంతో అంతో వంగిన ప్రతి పచ్చని మొక్కనూ వంచి అందుకుని విరగ్గొట్టాడు. యౌవనంలో కాలం అంతా కాలక్షేపానికే వుపయోగించాడు. సుఖంతో సోమరి అయ్యాడు. కాలం మళ్లీ మళ్లీ వస్తుందనుకున్నాడు. ఇప్పుడు యీ వయసుమళ్లిన కాలంలో జుత్తుకు రంగు రాసుకున్నా యౌవనుడిగా వుండాలన్నా వీలు కావటంలేదు. ఈ అక్కసుతోనే యీ అందాల బొమ్మను తనదానిని చేసుకున్నాడా? మనిషి జీవితచక్రం ఒక్కసారే ప్రదక్షిణ చేస్తుందని యిప్పుడే తట్టింది. ఏ కాలంలో వుండవలసినవీ, అనుభవించవలసినవీ, సాధించవలసిందీ, ఆ కాలంలో కాకపోతే, యింకో కాలంలో కాడానికి తగ్గ వాతావరణం వుండదు.

ఈ అమ్మాయి — ఎక్కడ పుట్టిందో? యెక్కడికొచ్చింది. ఎవరితో తిరిగిందో? ఎవరి పక్కనచేరి వీడ్ని కన్నదో? తన పెళ్ళం గురించే తన కెన్నో విషయాలు తెలియవు. ఎందరిగురించో యెన్నో విషయాలు తెలిసిపోయినట్లు యెన్నెన్నిసార్లు అనుకున్నాడు. ఈ బలహీనతలాంటి దేదో ఒక బలహీనతను యీవిడ వుపయోగించుకుని వీడి భారాన్ని తన నెత్తిమీద రుద్దిందని సుందరయ్య అక్కడ తనను కట్టుకున్నా యీవిడ పాత స్నేహితులను మరచిపోలేదన్న అనుమానం. తను పేరుకు మొగుడు కానీ ప్రేమకు కాదన్న బాధ.

అక్కడక్కడా నీటితో నిండినబావులు. వాటిపై కలువల్లా తేలే పక్షుల సమూహాలు ఇవన్నీ చూస్తూ తను మురిసిపోతున్నట్లే యీవిడ అందాన్ని చూస్తూ ముగ్ధుడవటమే మిగిలింది. ఆ పక్షులు తనవేపు చూడనట్లే యీ పిట్టా తనవేపు చూడదు.

"ఎదిగెదిగి పెద్దనై యెగర నేర్చేసరికి, రెక్కలు కత్తిరించి యీ పంజరంలో నన్ను బంధించావ్. ఎవరికోసం నాకడుపు నింపవు? నేనుకోరినవన్నీ యివ్వవు" — అన్నట్లు చూస్తుందామె తనవైపు అనుకున్నాడు సుందరయ్య.

వాడిప్పుడు యేపిలుపందు మరచాడు. ఎగిరేపిట్ట కావాలని యేడుస్తున్నాడు. ఆపిలుపందయితే స్టేషనులో కొనగలడు. పిట్టనెక్కడ తేగలడు?

"ఏం కావాలన్నా యెవరికంత శ్రద్ధ?" యీసడించింది ఆమె. అటువేపు తిరిగి చూశాడు. కారు మేఘం మరింత పేరుకుపోయినట్లుంది. తన దగ్గరకు వచ్చిన దగ్గరనించి యెప్పుడు పూలమబ్బు అయిందని? ఆమె చూపులు యిదివరకు దాచి పెట్టుకున్న ప్రేమాగ్నులన్నీ ఒక్కసారి భగ్గున మంటలుగాలేచి తనవైపు దారిచేస్తున్నట్లున్నయ్. వరదలై ప్రవహిస్తున్న మళ్లీ వీటికి ఆనకట్టలా ఆ పెదాలు బిగించివున్నాయ్. ఆమె కొండంత వలపు తన పాలిటి అగ్ని పర్వతమై పగిలి పారుతున్న లావా, వెంటతరుముతున్న పాములావుంది. తన చుట్టూవున్న పరిసరాలు, మనుషులు, నీతికీ అవసరానికీ మధ్య నలుగుతున్న వాళ్ళ జీవితాలు — వీటన్నిటిపై చూపించేస్తోంది, తనంటే యీమెకు రోత తన డబ్బంటే మోత. ఏంచేత?

ఇలా అనుకుంటూ కిటికీనించి చూసాడు పచ్చని పొలాలు. ఆ పచ్చదనంలో జీవం వుంది. అందంవుంది. అందుకే ప్రకృతి అందమైంది. తను జీవించి ప్రాణులకు జీవనాధారమైంది. అలాంటి ప్రకృతి ఒకో కాలంలో బీటలు దేరినా, పొట్టలో పచ్చదనాన్ని తల్లిలా పెంచుకుంటుంది.

తల్లి అన్నపదం గుర్తుకురాగానే అతని కళ్ళల్లో ఒక్కసారి నీరుబికింది. ఇంత నటన ఇంత దాపరికం ఇంతవేషం — ఇంతకిపి మధ్యలో యెంత మమకారం, యెంతత్యాగం దాగివుం..? ఈమెలోని కొడుకుపైని యీ మమకారం యీ చేనికున్న పచ్చదనం లాంటిదే కదూ? మరి తనకేముంది?

అప్పుడే ఆ పచ్చని చేలన్నీ దాటిపోయాయి. ఒక పెద్ద బీడునేల. ఎక్కడా ఒక చెట్టులేదు. ఒక మొక్కలేదు. ఒక పిట్టలేదు. అలా చూస్తుండగా....తిరిగి తిరిగి చూస్తుండగానే....చీకటి పడింది.

———